నేటి దినవార్తిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02



తగ్గిన చికెన్ ధరలు

కార్తీక మాసం ముగిసిన తర్వాత చికెన్ ధరలకు రెక్కలు వచ్చాయి. అయితే గత వారం నుంచి చికెన్ ధరలు తగ్గతూ వస్తున్నాయి. న్యూయర్ వేడుకల సమయంలో చికెన్ ధరలు భారీగా ఉండగా ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. జనవరి 2న స్కిన్ లెస్ చికెన్ రూ.221, విత్ స్కిన్ రూ.194 ఉండగా ఇప్పుడు రూ.152, రూ.133 గా చికెన్ ధరలు ఉన్నాయి. సంక్రాంతి పండుగకు చికెన్ ధరలు పెరిగే అవకాశం ఉంది.

స్పృహలో ఉండగానే చిన్నారికి బ్రెయిన్ సర్జరీ



ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు అరుదైన ఘనత సాధించారు. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఐదేళ్ల బాలికకు మెలకువగా ఉండగానే ఆమెకు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. 1వ తరగతి చదువుతున్న అక్షితా మెదడులో కణితులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో ఎయిమ్స్ న్యూరోసర్జరీ ప్రొఫెసర్ దీపక్ గుప్తా బృందం శస్త్రచికిత్స నిర్వహించింది. చిన్నారి మెలకువగా ఉన్నప్పుడు చేసే శస్త్రచికిత్సను 'అవేక్ క్రానియోటమీ' అంటారు.

ప్రముఖ కమ్యూనిస్టు నేత మహారాణి కోనార్ మృతి



ప్రముఖ కమ్యూనిస్టు నేత, అంగన్‌వాడీ ఫెడరేషన్ వ్యవస్థాపక నాయకురాలు మహారాణి కోనార్ శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లోని బుర్ద్వాన్‌లో కన్నుమూశారు. ఆమె వయస్సు 90 సంవత్సరాలు. మహారాణి కోనార్ నవంబర్ 23, 1933లో జన్మించారు. ఆమె 1958లో కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. బుర్ద్వాన్ జిల్లాలో కమ్యూనిస్ట్ పార్టీ మరియు వామపక్ష ఉద్యమాన్ని నిర్మించడంలో చురుకైన పాత్ర పోషించారు. బెంగాల్‌లో ఐద్వా కీలక నేతల్లో ఆమె ఒకరు.

జపాన్‌లోనూ సందడి చేయనున్న సలార్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'సలార్' మూవీ ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఇప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఈ మూవీ జోరు తగ్గడం లేదు. ఇండియాలోనే కాదు విదేశాల్లో సైతం ఈ మూవీ సత్తా చాటుతుంది. ఈ క్రమంలో ఈ సినిమాను ఈ వేసవిలో జపాన్‌లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. అలాగే, మార్చి 7న లాటిన్ అమెరికాలో స్పానిష్ భాషలో ఈ మూవీ విడుదల కానుంది.

ప్రజాపాలన దరఖాస్తులపై
సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

నేడు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కేబినెట్ సమావేశం అవుతుంది. ఈ నెల రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, చెయ్యాల్సిన పథకాలతో పాటు పథకాల అమలు తీరు, పాలన ఎలా కొనసాగుతోంది? ప్రజల స్పందన ఎలా ఉంది? టీఎస్పీఎస్సీ పరిస్థితి ఏంటి? ఉద్యోగాల భర్తీ ఎలా చేయాలి? లాంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చకు వచ్చే ఛాన్స్ ఉంది. ఇక, డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులను ప్రజల నుంచి భారీగా తీసుకుంది. వాటిపై ఇవాళ కేబినెట్‌లో ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. ఆ తర్వాత ఈ నెల 17 నాటికి దరఖాస్తుల పరిశీలన పూర్తి చెయ్యాలనే ప్లాన్ చేస్తుంది.. తద్వారా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం అవుతుంది. దీనిపై కూడా నేటి మంత్రి మండలి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే, ప్రజాపాలనలో ఏకంగా కోటి 24 లక్షలకు పైగా దరఖాస్తులు రావడంతో.. వారందరూ 6 హామీల కోసం వేచి చూస్తున్నారు.. వంద రోజుల్లో ఈ హామీలు అమలు చేస్తామన్న హస్తం పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు లోక్‌సభ ఎన్నికలకు కూడా సమాయత్తం అవుతున్నారు. ఈ హామీలను చెప్పిన విధంగా అమలు చెయ్యకపోతే, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి ప్రజలు షాక్ ఇచ్చే అవకాశం కూడా ఉంది. అలా జరగకుండా సీఎం రేవంత్ రెడ్డి ట్రై చేస్తున్నట్లు తెలుస్తుంది.

గత నెల 28 తేదీ నుండి ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల పరిశీలన, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సోమవారం నాడు డా. బి. ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి లతో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేకంగా నియమించిన నోడల్ అధికారులు, సి.జి.జి డైరెక్టర్ జనరల్, జీహెచ్ఎంసీ కమిషనర్ తదితర ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరుకానున్నారు.

ఈ సమావేశంలో ప్రజాపాలనపై ప్రత్యేకంగా రూపొందించిన వెబ్-సైట్ https://prajapalana.telangana.gov.in/ ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

ప్రజాపాలనలో మొత్తం 1,25,84,383 దరఖాస్తులు

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ జరిగిన పది రోజుల్లో మొత్తం 1,25,84,383 దరఖాస్తులు అందాయి. వీటిలో ఐదు గ్యారెంటీలకు సంబంధించి 1,05,91,636 దరఖాస్తులు కాగా, ఇతర అభ్యర్థనలకు సంబంధించి 19,92,747 ఉన్నాయి.

రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయితీలు, 3,623 మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన సభలను నిర్వహించగా, ఈ గ్రామ సభల్లో 1,11,46,293 మంది పాల్గొన్నారు. ఈ ప్రజాపాలనలో మొత్తం 3,714 అధికార బృందాలు పాల్గొనగా దరఖాస్తుల స్వీకరణకు 44,568 కౌంటర్లను ఏర్పాటు చేశారు.

మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా
గుంటూరు కారం ట్రైలర్!



మేకర్స్ తాజాగా సినిమాకి సంబంధించిన ట్రైలర్ ను విడుదల చేసారు. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ట్రైలర్ లో సూపర్ స్టార్ మహేష్ బాబు అటు క్లాస్ ఆడియన్స్ ను, ఇటు మాస్ ఆడియెన్స్ ను అలరించే పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. కామెడీ సన్నివేశాలు, యాక్షన్ సన్నివేశాలతో పాటుగా, ఎమోషన్స్ కూడా గట్టిగానే ఉన్నాయి. ఈ పవర్ ప్యాక్డ్ ట్రైలర్ తో సినిమా పై అంచనాలు భారీగా పెరిగాయి అని చెప్పాలి. ఈ చిత్రం లో యంగ్ బ్యూటీ శ్రీ లీల, మీనాక్షి చౌదరి లేడీ లీడ్ రోల్స్ లో నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, రమ్య కృష్ణ, రావు రమేష్, అజయ్ ఘోష్, జగపతి బాబు తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

దేవుళ్ల పేరుతో ప్రజాపాలనలో దరఖాస్తు

ప్రజాపాలనలో చివరి రోజు దేవుళ్ల పేరుతో దరఖాస్తు రావడం చర్చనీయాంశంగా మారింది. భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన ఏనుగు వెంకట సురేందర్‌రెడ్డి.. శివయ్య పేరుతో దరఖాస్తు చేశారు. కుటుంబ సభ్యులుగా భార్య పార్వతీదేవి, కుమారుల పేర్లు కుమారస్వామి, వినాయకుడిగా నమోదు చేశారు. శివుని వయసు 1200 సంవత్సరాలుగా పేర్కొంటూ దరఖాస్తు సమర్పించగా దానికి అధికారులు రసీదు ఇచ్చారు. దీనిపై వెంకట సురేందర్‌రెడ్డి విచారం వ్యక్తం చేస్తూ.. పొరపాటుగా జరిగింది తప్ప ఉద్దేశపూర్వకంగా చేయలేదన్నారు.

ఢిల్లీ స్కూళ్లకు మరో 5 రోజులు సెలవులు

ఢిల్లీలో చలి తీవ్రత పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలకు ఈ నెల 12వ తేదీ వరకు సెలవులను పొడిగించింది. ఢిల్లీలో పాఠశాలలకు సోమవారంతో శీతాకాల సెలవులు ముగియాల్సి ఉంది. 'ఢిల్లీలో చలి వాతావరణ పరిస్థితులు కొనసాగుతుండటంతో నర్సరీ నుంచి అయిదో తరగతి వరకు ప్రభుత్వ మరో అయిదు రోజుల పాటు మూసి నిర్ణయించాం'అని విద్యాశాఖ మంత్రి వారం 'ఎక్స్'లో తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక తమ విద్యార్థుల కోసం ఆన్‌లైన్ తరగతులు మకోవచ్చని తెలుపుతూ విద్యాశాఖ సర్కులర్ ంది. 6 నుంచి 12వ తరగతి వరకు చదివే కోసం ఉదయం 8 గంటలు-సాయంత్రం 5 ధ్ధలోనే తరగతులు నడపాలని కోరింది.

లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు మన సూచీలపై ప్రభావం చూపుతున్నాయి. ఉదయం 9:21 గంటల సమయంలో సెన్సెక్స్ 90 పాయింట్లు పెరిగి 72,116 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 13 పాయింట్లు పుంజుకొని 21,724 వద్ద కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.10 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో టైటన్, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్, మారుతీ, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్‌ఫార్మా షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే ఇండియా, టెక్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి.

22న దీపకాంతులలో ఢిల్లీ ఆలయాలు

జనవరి 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా దేశరాజధాని ఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అన్ని దేవాలయాలను రంగురంగుల దీపాలతో, పూలతో అలంకరించనున్నారు. అంతే కాకుండా అలయాల్లో రామచరితమానసను పారాయణం చేయడంతోపాటు రామచరిత మానస ప్రతులను పంపిణీ చేయనున్నారు. శ్రీ రాంలీలా మహాసంఘ్ నేతృత్వంలో ఢిల్లీలో 22న అలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మహాసంఘ్ అధ్యక్షుడు అర్జున్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ 550 ఏళ్ల తర్వాత అయోధ్యలో శ్రీరాముని ఆరాధించే అవకాశం మనకు లభించబోతోందని అన్నారు. అందుకే ఆ రోజును చారిత్రాత్మకంగా మార్చేందుకు రామ్‌లీలా కమిటీలన్నీ తమ ప్రాంతాల్లోని అలయాలను రంగురంగుల దీపాలతో, పూలతో అలంకరించాలని నిర్ణయించాయన్నారు.

తేజస్వి అందాల మెరుపులు

చేస్తోంది. ఇటీవల సినిమా ఆఫర్స్ తగ్గినా క్రేజ్ మాత్రం తగ్గలేదు. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' చిత్రంలో సినీరంగంలోకి అడుగు పెట్టింది. 'ఐస్‌క్రీమ్' సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అడల్ట్ మూవీస్‌లో నటిస్తే తప్పేం లేదంటున్న తేజస్వి. స్టార్ మాలోని బిబి జోడి కార్యక్రమంలో తన డ్యాన్స్‌తో ప్రేక్షకులను అలరించింది. ఈ బ్యూటీ నటించిన చివరి చిత్రం' కమిట్మెంట్'. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ తెగ సందడి చేస్తుంది. నటి తేజస్వి మదివాడ వలపుల విందు. మత్తెక్కించే చూపులతో కుర్రకారును తెగ అట్రాక్ట్ చేస్తోంది ఐశ్వర్య మీనన్. గ్లామర్ డోస్ మరింత పెంచేసి తన అందచందాలతో మైమరిపిస్తోంది. ఫోటో షూట్‌లో వయ్యారాలన్నీ ఒలకబోస్తూ రెచ్చిపోతుంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన పిక్స్ వైరల్ అవుతున్నాయి.

శ్రీలంకలో తొలిసారి జల్లికట్టు సంబరాలు

శ్రీలంకలో తొలిసారిగా జల్లికట్టు వేడుకలు జరుగుతున్నాయి. శ్రీలంక తూర్పు ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండమాన్, మలేషియా ఎంపీ ఎం శరవణన్ శనివారం ఉదయం ఈ సంబురాలను ప్రారంభించారు. ట్రింకోమలీలోని క్రీడా మైదానంలో జల్లికట్టు వేడుకల్లో మొత్తం 200 ఎద్దులు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



మాల్దీవులకు ఫ్లైట్ బుకింగ్స్

నిలిపివేసిన ఈజ్‌మైట్రిప్

భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతూ మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో దేశీయ ప్రయాణ సంస్థ ఈజ్‌మైట్రిప్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశానికి ఫ్లైట్ బుకింగ్స్ నిలిపివేయాలని సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన నిషాంత్ పిట్టి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ సంస్థ దిల్లీ కేంద్రంగా సేవలు అందిస్తోంది. నిషాంత్ పిట్టి, రికాంత్ పిట్టి, ప్రశాంత్ పిట్టి దీనిని 2008లో స్థాపించారు.

శివాత్మిక రాజశేఖర్ హాట్ షో..

సీనియర్ హీరో రాజశేఖర్ కూతురిగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది అందాల భామ శివాత్మిక రాజశేఖర్. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ బిజీగా ఉంది శివాత్మిక. కథలకు ప్రాధాన్యత ఉన్న పాత్రాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తుంది అందాల భామ శివాత్మిక రాజశేఖర్. ఇటీవలే వరుస సినిమాలతో ఆకట్టుకుంటుంది. శివాత్మిక రాజశేఖర్.. ఆ మధ్య విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ హీరోగా వచ్చిన దొరసాని సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైయ్యారు. తొలి సినిమా అనుకున్నంతగా ఆకట్టుకోలేకపోయినా.. నటిగా మాత్రం ఈ భామకు మంచి మార్కులు పడ్డాయి. అది అలా ఉంటే తాజాగా శివాత్మిక కొన్ని ఫోటోస్‌ను తన సోషల్ మీడియాలో పంచుకున్నారు.పాత్రకు ప్రాధాన్యత ఉన్న కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటుంది శివాత్మిక. తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంటుంది.

టీ20 సిరీస్‌తో రోహిత్, కోహ్లీ రీఎంట్రీ

దక్షిణఫ్రికాపై చారిత్రాత్మక విజయంతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించిన భారత క్రికెట్ జట్టు మరోసారి రంగంలోకి దిగేందుకు సిద్ధమైంది. కొత్త ఏడాది లో మొదటిగా అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20 ల సిరీస్‌లో టీమ్ ఇండియా తలపడనుంది. ఇందుకోసం బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. అఫ్గానిస్థాన్‌తో వచ్చే వారం నుంచి టీ20 సిరీస్ కోసం రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. దీంతో పాటు విరాట్ కోహ్లీ కూడా టీ20 జట్టులోకి తిరిగి వచ్చాడు. ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు నవంబర్ 2022 తర్వాత తిరిగి పొట్టి ఫార్మాట్‌లో ఆడనుండడం గమనార్హం. జనవరి 11 నుంచి భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. టీ20 ప్రపంచకప్ 2024కి ముందు టీమ్ ఇండియాకు ఇదే చివరి అంతర్జాతీయ టీ20 సిరీస్. అటువంటి పరిస్థితిలో రోహిత్, విరాట్ తిరిగి టీ20ల్లోకి వస్తారా? అన్న ప్రశ్నలు తలెత్తాయి. నవంబర్ 2022లో ఇంగ్లండ్‌తో జరిగిన ప్రపంచ కప్ సెమీ-ఫైనల్ ఓటమి తర్వాత ఇద్దరు ఆటగాళ్లు ఈ ఫార్మాట్‌కు దూరంగా ఉన్నారు. హార్దిక్, రోహిత్‌లలో ఎవరికి కెప్టెన్సీ దక్కుతుందనే ప్రశ్న కూడా తలెత్తింది. వీటన్నింటికీ ఆదివారం సమాధానం దొరికింది. ఊహాగానాలన్నీ నిజమేనని రుజువు చేస్తూ సెలక్షన్ కమిటీ వెటరన్ ఆటగాళ్లిద్దరికీ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం కల్పించింది. గత 14 నెలలుగా రోహిత్, విరాట్ ఈ ఫార్మాట్‌కు దూరంగా ఉన్నారు. హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ ఇంకా పూర్తి ఫిట్‌గా లేనందున ఈ సిరీస్‌కు ఎంపిక చేయలేదు. దీంతో సెలెక్టర్లు రోహిత్ శర్మకే కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించారు.

ఇషాన్, శ్రేయస్ దూరం..

అయితే వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్‌కు ఈ సిరీస్‌లో చోటు దక్కలేదు. గతంలో ఇషాన్ దక్షిణాఫ్రికా పర్యటనలో టీ20 సిరీస్‌లో భాగమయ్యాడు. అయితే మానసికంగా అలసట కారణంగా టెస్టు సిరీస్ నుంచి తప్పుకుని క్రికెట్‌కు కొంత విరామం ప్రకటించాడు. ఇషాన్ తిరిగి రావడానికి ఇంకా అందుబాటులో లేరా లేదా అతనిని ఎంపిక చేయకూడదని సెలక్టర్లు నిర్ణయించుకున్నారా లేదా అనే విషయాన్ని బీసీసీఐ వెల్లడించలేదు. అతనితో పాటు మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్‌ని కూడా ఈ సిరీస్ నుంచి తప్పించారు. అతను దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో భాగమయ్యాడు. జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా మరియు మహ్మద్ సిరాజ్‌లకు ఈ సిరీస్ నుండి విశ్రాంతి కల్పించారు. జనవరి 25 నుండి ఇంగ్లండ్‌తో ప్రారంభమయ్యే టెస్ట్ సిరీస్‌కు వీరు అందుబాటులో ఉండనున్నట్లు తెలుస్తోంది.

జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, యశస్వి, కోహ్లీ, తిలక్, రింకూ, జితేశ్, శాంసన్, శివమ్, సుందర్, అక్షర్, రవి, కుల్దీప్, అర్ష్‌దీప్, అవేశ్, ముఖేశ్.

భారత్-అఫ్గానిస్థాన్ టీ20 సిరీస్

11 జనవరి- 1వ టీ20, మొహాలీ

14 జనవరి- రెండవ T20, ఇండోర్

జనవరి 17- 3వ టీ20, బెంగళూరు

మయన్మార్‌లోని ఒక గ్రామంపై బాంబు దాడి..

పిల్లలతో సహా 17మంది మృతి

మయన్మార్‌లోని వాయువ్య ప్రాంతంలోని ఒక గ్రామంపై సైన్యం జరిపిన వైమానిక దాడుల్లో తొమ్మిది మంది చిన్నారులు సహా కనీసం 17 మంది పౌరులు మరణించారు. మానవ హక్కుల సంఘం ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించింది. భారత సరిహద్దుకు దక్షిణంగా ఉన్న సగయింగ్ ప్రాంతంలోని కనన్ గ్రామంలో ఉదయం జరిగిన వైమానిక దాడిలో దాదాపు 20 మంది గాయపడ్డారని చెప్పారు. ఫిబ్రవరి 2021లో ప్రజాస్వామ్య అనుకూల నేత ఆంగ్ సాన్ సూకీ ఎన్నికైన ప్రభుత్వాన్ని సైన్యం తొలగించింది. గతేడాది ఏప్రిల్‌లో మయన్మార్ సైన్యం జరిపిన వైమానిక దాడిలో 100 మందికి పైగా మరణించారు. సైనిక పాలనకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వీరు వెళ్లినట్లు సమాచారం. మయన్మార్ వైమానిక దాడులను ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల చీఫ్ కూడా ఖండించారు. వోల్కర్ టర్క్ మాట్లాడుతూ.. పౌరులపై దాడులకు సంబంధించిన నివేదికలు చాలా ఆందోళన కలిగిస్తున్నాయి. అక్కడ స్కూల్ పిల్లలు కూడా ఉన్నారని తెలిపారు. ఫిబ్రవరి 2021లో మయన్మార్ సైన్యం దేశంలో తిరుగుబాటు చేసింది. ఆ తర్వాత అధికారాన్ని చేజిక్కించుకుంది. అప్పటి నుంచి మయన్మార్‌లో సైనిక పాలనకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఆందోళనకారులపై సైన్యం చర్యలు తీసుకుంటోంది. తిరుగుబాటు తర్వాత మూడు వేల మందికి పైగా పౌరులు మరణించారు. వైమానిక దాడిలో నేషనల్ యూనిటీ గవర్నమెంట్ (ఎన్‌యుజి) కార్యాలయం కూడా ధ్వంసమైంది. దాడి సమయంలో మహిళలు, పిల్లలు సహా 150 మందికి పైగా ప్రజలు వేదిక వద్ద ఉన్నారు. వారిలో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో మిలటరీ పాలన వ్యతిరేక సాయుధ గ్రూపులు, ఇతర రాజకీయ సంస్థల నేతలు కూడా ఉన్నారని ఆయన చెప్పారు.

కాల్వలోకి దూసుకెళ్లిన 108 వాహనం

అమృతలూరు మండలం పెదపూడి వంతెన మలుపు వద్ద ఆదివారం వేకువన 108 వాహనం నిజాంపట్నం కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో వాహనంలోని వ్యక్తులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. నిజాంపట్నం మండలం గోకర్ణమఠం నుండి అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి, మరో ముగ్గురు సహాయకులతో 108 వాహనం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు ప్రయాణిస్తోంది. వేకువన మంచు ఎక్కువగా ఉండడంతో పెదపూడి వంతెన మలుపులో చోదకుడికి మార్గం కనిపించలేదు. దీంతో అదుపుతప్పి కాల్వలోకి వాహనం దూసుకెళ్లింది. డ్రైవర్ అంకమ్మరావు ఈ విషయాన్ని అమృతలూరు 108 వాహన సిబ్బందికి తెలిపారు. వెంటనే అమృతలూరుకు చెందిన 108 వాహనం ద్వారా బాధితులను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్రేన్ సాయంతో కాలువ నుంచి వాహనాన్ని బయటకు తీశారు.

కేంద్ర మంత్రికి తృటిలో తప్పిన ప్రమాదం!

చిలికా సరస్సులో చిక్కుకుపోయిన పడవ..

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖల మంత్రి పురుషోత్తం రూపాల ప్రమాదం నుంచి బయటపడ్డారు. కేంద్ర మంత్రి ప్రయాణిస్తున్న పడవ ఆదివారం సాయంత్రం ఒడిశాలోని చిలికా సరస్సులో రెండు గంటల పాటు చిక్కుకుపోయింది. వెంటనే స్పందించిన సిబ్బంది చిలికా సరస్సులోకి మరో పడవను పంపి.. మంత్రిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. మత్స్యకారులు వేసిన వలలో పడవ ఇరుక్కుపోయి ఉంటుందని ముందుగా అనుమానించగా.. తాము దారి తప్పిపోయామని మంత్రి పురుషోత్తం స్పష్టం చేశారు. 11వ దశ 'సాగర్ పరిక్రమ' కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులతో సమావేశం అయ్యేందుకు ఒడిశా పర్యటనకు కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల వచ్చారు. ఖుర్దా జిల్లాలోని బార్కుల్ నుంచి పూరీ జిల్లాలోని సతపదాకు పడవలో కేంద్ర మంత్రి బయల్దేరారు. మంత్రితో పాటు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర, ఇతర స్థానిక పార్టీ నాయకులు కూడా పడవలో ఉన్నారు. చీకటి పడడంతో పడవ నడిపే వ్యక్తి కొత్త దారిలో వెళ్లాడు. దీంతో వెళ్లాల్సిన దారి తప్పిపోయారు. చిలికా సరస్సు మధ్యలో నలబానా పక్షుల అభయారణ్యం సమీపంలో పడవ సుమారు రెండు గంటలపాటు చిక్కుకుపోయింది.

నేడు వికాస్ భారత్ సంకల్ప యాత్ర లబ్ధిదారులతో

ప్రధాని మోడీ వర్చువల్‌గా భేటీ

నేడు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మధ్యాహ్నం 12 గంటలకు వికాస్ భారత్ సంకల్ప యాత్ర లబ్ధిదారులతో వర్చువల్ గా మాట్లాడబోతున్నారు. వికాస్ భారత్ సంకల్ప యాత్రతో పాటు నడుస్తున్న ప్రచార రథాల్లో ప్రధాని నేరుగా పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్ యదువంశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, పార్టీ అధికారులు, కార్యకర్తలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పంచాయతీ అధ్యక్షుడు, సభ్యులు, బ్లాక్ హెడ్‌లు, గ్రామపెద్దలు, స్థానిక పౌరులతో పాటు ప్రజా సంక్షేమ పథకాల లబ్ధిదారులు కూడా ప్రధానమంత్రితో మాట్లాడే అవకాశం ఉంది. అయితే, నవంబర్ 15, 2023న ప్రారంభించినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఉన్న 'వికాస్ భారత్ సంకల్ప యాత్ర' లబ్ధిదారులతో ప్రధాన మంత్రి మోడీ క్రమం తప్పకుండా మాట్లాడుతున్నారు.. ఈ వీడియో కాన్ఫరెన్స్ ఇప్పటి వరకు నాలుగు సార్లు జరిగింది. ఇదే కాకుండా, గత నెలలో వారణాసి పర్యటన సందర్భంగా ప్రధాన మంత్రి వరుసగా రెండు రోజులు (డిసెంబర్ 17-18 తేదీలలో) 'వికాస్ భారత్ సంకల్ప యాత్ర' లబ్ధిదారులతో ముఖాముఖిగా సమావేశం అయ్యారు. ప్రభుత్వ ప్రధాన పథకాలలో సంపూర్ణతను సాధించే లక్ష్యంతో 'వికాస్ భారత్ సంకల్ప యాత్ర' దేశవ్యాప్తంగా చేపట్టబడుతోంది. ఈ పథకాల ద్వారా ప్రయోజనాలు నిర్దేశిత లబ్ధిదారులందరికీ సకాలంలో చేరేలా చూస్తారు. అలాగే, ఈ నెల 5వ తేదీన జరిగిన ఈ వికాస్ భారత్ సంకల్ప యాత్రలో

దాదాపు 10 కోట్ల మందికి పైగా జనం పాల్గొన్నారు. ఇది ప్రారంభమైన 50 రోజుల్లోనే అద్భుతమైన రికార్డ్ సృష్టించింది.. 'అభివృద్ధి చెందిన భారతదేశం' అనే ఉమ్మడి దృక్పథంతో పాటు దేశవ్యాప్తంగా ప్రజలను ఏకం చేయడంలో ఈ యాత్రపై ఖచ్చితంగా ప్రభావం చూపుతుంది అని ప్రధాని మోడీ తెలియజేశారు.

యశ్ పుట్టినరోజు వేడుకల్లో విషాదం.. బ్యానర్ కడుతూ ముగ్గురు అభిమానులు మృతి

ప్రముఖ కన్నడ నటుడు యశ్ బర్త్ డే వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. యశ్ నేడు 38వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని గడగ్ జిల్లాలో కొందరు అభిమానులు నటుడి బ్యానర్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై ముగ్గురు అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కాగా, యశ్ అసలు పేరు నవీన్ కుమార్ గౌడ. 2007లో 'జంబడ హుడుగి' సినిమాతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత 'రాకీ' (2008), 'గూర్ల్' (2013), 'మిస్టర్ అండ్ మిస్ రామాచారి' (2014) సినిమాలతో ఇండస్ట్రీలో తనకంటూ స్థానం సంపాదించుకున్నాడు. ఇక 'కేజీఎఫ్' సిరీస్‌తో ఏకంగా పాన్ ఇండియా స్టార్‌గా మారిపోయాడు. యశ్ ప్రస్తుతం 'టాక్సిక్' (Toxic) అనే చిత్రంలో నటిస్తున్నారు. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పూర్తి స్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం 2025 ఏప్రిల్ 10న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఈ సినిమాలో సాయి పల్లవిని హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. 'కేజీఎఫ్' లాంటి భారీ హిట్ తర్వాత యశ్ నటిస్తోన్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.